# రంగడికి నవ్వొచ్చింది

కవన శర్మ

నన్ను నా పత్రికా సంపాదకుడు దిబ్బ రాష్ట్రం వెళ్ళి స్వయంగా పరిస్థితులు చూసి అక్కడి విషయాల గురించి, విద్యా విధానం గురించి ఒక వ్యాసం వ్రాసిమ్మన్నాడు. నేను సిగరెట్టు పెట్టెలు, అగ్గిపెట్టెలు, పెన్సిళ్ళు, బ్లేడులే కాకుండా ఒక టేప్ రికార్డర్ కూడా సర్దుకొని తీసుకువెళ్ళాను దిబ్బ రాష్ట్రానికి. ఇక్కడ కొంతకాలాన్ని ఖర్చు వ్రాసి పత్రికలో కాలాన్ని అచ్చువేయాలి.

ఓటర్లుండేది పాకలలో కనక అక్కడుండేవాళ్ళని "మీ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం వుందనుకుంటున్నారా?" అని అడిగాను.

"లేకపోవడం ఏటండి! మా పెద్ద బాగా వుంది. అయిదేళ్ళకోసారి ఎన్నికలవుతుండాయా! అప్పుడు మా సేతుల్లో అయిదో పదో పెడ్తున్నారా!" అన్నాడొకడు. రికార్డ్ చేశాను సంపాదకుడు నన్ను కొట్టిపారెయ్యడానికి వీల్లేకుండా.

"ముఖ్యమంత్రి గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"నాన్నగోరి గురించా! ఆయన తండిరి లాంటోరు. మేం అవసరానికి 'నాన్నగోరూ!' అని పిలుస్తే ఆయన 'ఓయ్!' అని పలుకుతాడు. ఇలా సమాధానం చెప్తున్న మనిషి మరోడ్ని నోరిప్పనీలేదు. ఆ మరోడు 'నోరిప్పితే అంతా సారా కంపు' అన్నాడితడు నా కనుమానం రాకుండా.

ఆ తరువాత విద్యార్థి నాయకుడిని కలుసుకుని, "మీ నాన్నగారు విద్య గురించి శ్రద్ధ తీసుకుంటారా?" అని అడిగాను.

"ఇంట్లో నాన్నగారు తీసుకోరు. అయితే, ముఖ్యమంత్రి ఫాదర్ విపరీతంగా తీసుకుంటారు. ఆయన, ఉద్యోగాలకి-డిగ్రీలకి, ఉద్యోగాలకి-అధికారానికి వున్న కనెక్షన్స్, చాలా బాగా అర్థం చేసుకున్నారు. ఎడ్యుకేషన్ కంకరెంటు సబ్జెక్ట్ అయినా సెంటర్ వద్దన్నా నాలుగు యూనివర్సిటీలు పెట్టారు. 'నా కొడుకులు ముష్టోళ్ళు కారు; విద్యని అర్థించడానికి. చదువుని కొంటారు; మహారాజ బిడ్డల్లా!' అంటూ బోలెడు కాలేజీలు పెట్టుక్కోడానికి, విశ్వవిద్యాలయాలకి పెద్ద మనసుతో అనుమతిచ్చారు. అప్పటి నుంచి విద్య వంద కాలేజీలు, లక్ష సీట్లుగా వర్ధిల్లుతోంది" అని చెప్పాడతను.

విశ్వవిద్యాలయాల కులపతుల గురించి తెలుసుకుందాం అని కులపెద్దల దగ్గరకు వెళ్ళాను.

"ముఖ్యమంత్రికి ప్రాంతీయ పక్షపాతం, కుల పక్షపాతం వున్నాయా?" అని అడిగాను.


"ఛీ! ఛీ! దేవుడికైనా ఇంద్రుడి మీద, అర్జునుడి మీద పక్షపాతం వుంటాది గాని ఈయన కుండదు. ఆయన తలుచుకుంటే తన కులపోళ్ళలోనే నాయిస్సున్నోళ్ళకి ఛాన్సు ఇచ్చుండును. ఆయన అల్లా కాకుండా నాయిస్సున్సులు నాలుగు కులాల వాళ్ళకి పక్షపాతరహితంగా పంచిపెట్టాడు" అని చెప్పారు.

ఇంకొక్క అనుమానం మిగిలిపోయింది నాకు. అందుకని ఒక భాషావేత్తని పట్టుకొని "మీ రాష్ట్రానికీపేరు ఎల్లా వచ్చింది?" అని అడిగాను.

"ఈ రాష్ట్రం పేరు మొదట్లో దినిసీమ. అయితే, సింధు జనాలకి పార్సీలవల్ల హిందువులని పేరు వచ్చినట్టుగా ఈ పేరు మాకు బంగ దేశీయులవల్ల వచ్చింది. కొన్ని తరాల వెనుక వీథులలో రత్నరాసులు పోసుండేవి ఇక్కడ. అవి చూడడానికి వచ్చిన బంగ దేశీయులు కొందరు తమ పుస్తకాలలో 'దిబి దేశంలో ప్రజలు రత్నాల్ని వీథులలో పారబోసి, రాళ్ళని ఉన్నతాసనా లెక్కించి పూజిస్తారు' అని రాశారు. అదే వాడుకలోకి వచ్చింది. దినిసీమ దిబి దేశం అయి కూర్చుంది. ఆ పేరు ప్రాకృతుల నోళ్ళలో పడి దిబ్బ దేశం అన్న వికృత నామం ధరించింది. రాష్ట్రానికి తీరాన్న ఇసుక దిబ్బలు, రాష్ట్రం మధ్యలో ఎర్రమట్టి దిబ్బలు వుండడంచేత ఈ సీమకు దిబ్బ రాష్ట్రం అని పేరొచ్చిందని సాధారణంగా వినవచ్చే మాటలో సత్యం లేదు" అని ఆయన వాక్కావక్కాణించాడు.

దిబ్బ రాష్ట్రంలో పని ముగించుకుని అలసట తీర్చుకునేందుకు ఒక బార్‌లోకెళ్ళి కూర్చుని బీర్ తాగుతున్నాను. పక్క టేబుల్ నుంచి, "రంగడికి నవ్వొ

తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి బహుమతి పొందిన కార్టూను



చ్చింది" అన్న మాటలు, ఆ పైన ఆ బారంతా నిండిన నిండైన నవ్వు వినిపించాయి.

"ధన్యులం" అన్నారు మిగిలిన మూడు కుర్చీల నిండుగా వున్న పెద్ద మనుష్యులు. రంగడి నవ్వుకి, దిబ్బ రాష్ట్రానికి సంబంధం వుండదనుకుని నేను వారిని ఏమీ ప్రశ్నించలేదు టేపు రికార్డరున్నా.

ఆ పైన శ్రమించి నేను తెలుసుకున్న విషయాల మీద వ్యాసం వ్రాసి సంపాదకుడిగారి కిద్దామని తీసుకు వెళ్ళాను. అప్పుడాయన పాముల ప్రొఫెసర్‌గారు పంపిన పరిశోధనా వ్యాసం చదువుతున్నారు. ట్రేలో రాక్షసుల గుళ్ళు గురించి ఒక వ్యాసం, "అవి ఎలెక్ట్రాన్లా? దయ్యాలా?" అన్న మరో వ్యాసం వున్నాయి.

సంపాదకుడుగారు తలెత్తి నా వ్యాసం చేతిలోకి తీసుకుని, అక్కడా అక్కడా చదివి, "ఏమిటిది? ఏ విషయం గురించి సరిగా పరిశోధించి రాయవ్! పరిశోధనా వ్యాసాలంటే ఇల్లా వుండాలి!" అంటూ ఇందాక నేను మనవి చేసిన వ్యాసాలు చూపించారు.

"వాళ్ళు స్వంత ఖర్చుల్తో పరిశోధిస్తారు కనక ఎక్కడ పడ్తే అక్కడ ఎన్ని రోజులు పడ్తే అన్ని రోజులు వుండి క్షుణ్ణంగా పరిశోధిస్తారు. నాకు మీరు మూడ్రోజులకో చోట డ్యూటీ వేస్తుంటే సోమరాజుకి, ఆయన బావగారికి తేడా తెలియని హాలంలా వుంటుంది నా పరిస్థితి" అని కొంచెం కోపంగా జవాబు చెప్పాను.

"ఈసారి సమగ్రంగా వ్యాసం రాసుకురా! ఎన్ని రోజులైనా సరే" అన్నారు సంపాదకుడుగారు.

అందుకని మరోసారి దిబ్బ రాష్ట్రానికి నా సరంజామా అంతా తీసుకువెళ్ళాను. ఈసారి చాలా పట్టుదలమీద వెళ్ళాను. నా చెవిన పడ్డ ఏ మాటనూ అశ్రద్ధ చేయదల్చుకోలేదు. ఆఖరికి రంగడి నవ్వులను, సుబ్బమ్మ ఏడుపులను కూడా శ్రద్ధగా ఇన్వెస్టిగేట్ చేయాలనుకున్నాను.

దిబ్బ రాష్ట్రంలో చెవులు ఒగ్గి, కళ్ళు తెరుచుకుని, నోరు వీలైనంత మూసుకుని తిరుగసాగాను. అతి సన్నిహితులు మాట్లాడుకునేటప్పుడు వారి మాటల్లో దిబ్బ భాగోతం అన్న మాట దొర్లడం, అది దొర్లినప్పుడు వాళ్ళు గొంతుకలు తగ్గించి మాట్లాడుకోవడం విన్నాను, గమనించాను. వెంటనే "ఏమిటి అంటున్నారు?" అని వెళ్ళి అడిగాను. వాళ్ళు తాము ఏమీ అనడం లేదని బుకాయించారు. అందులో ఒక యువకుడు మాత్రం అందరు వెళ్ళిపోయేవరకు ఆగి, "దిబ్బ భాగవతం గురించి మాట్లాడుకుంటున్నాం" అని ఒప్పుకున్నాడు. "అది నాన్నగారు, తదితరులు ఆ రాష్ట్రంలో ఆడే భాగోతం" అని వివరించాడు.

"ఉదాహరణకి?"

"మీరే తెల్సుకోండి" అంటూ ఎవరో తరుముకు వచ్చినట్టు పారిపోయాడు.

గత్యంతరం లేక ఇంతకు పూర్వం కలుసుకున్న



భాషావేత్తని కలుసుకుని "ఇక్కడ ఏ భాగోతాలని దిబ్బ భాగోతాల జాబితాలో ప్రజలు చేరుస్తారు?" అని అడిగాను.

అతను కొద్దిగా కలవరపడి "అటువంటి మాటేమీ నేను వినలేదే!" అన్నాడు.

"నేను చాలాసార్లు విన్నాను" అన్నాను. టేప్ రికార్డరు ప్లే చేసి వినిపించాను.

అతను కొద్దిగా నవ్వి "ఆ అదా! అదో అపభ్రంశపు మాట. దివి దేశ భాగాన్ని ఆనుకొని ఒక పెద్ద అఖాతం వుంది మీకు తెలుసు కదా! దాన్ని దివి భాగ అఖాతం అనేవారు. ఇక్కడి పెద్దలు ఆ అఖాతాన్ని చూచి చూసి గంభీరులైపోయారు. ఆ గంభీర ప్రవర్తనకు దివి భాగాఖాత ప్రవర్తన అన్న పేరు ఏర్పడింది. 'దివి' అన్న మాట దిబ్బ అయిందని చెప్పాను కదా! అందుకని దిబ్బ భాగాఖాతం అన్నది పెద్దల ప్రవర్తనకి మరో పేరైంది" అన్నాడు.

"భాగాఖాతం భాగోతం ఎల్లా అయింది?"

"ఆ మధ్య తమిళుల సాంగత్యం గౌరవప్రదమై వారి ప్రభావం ప్రబలమైంది. అప్పుడు ఉచ్చారణ మారి దిబ్బ భాగోతం అన్న మాట ప్రచారంలోకి వచ్చింది."

అతను చెప్పిన 'మాట పుట్టుక' నాకు సబబుగానే అనిపించింది.

ఓ నాలుగు రోజుల తరువాత బారులో కూర్చుని, వుత్తినే కూర్చోడం ఎందుకని బీరు తాగుతున్నాను.

అప్పుడు రంగడు చేస్తున్న విలాసం నా కంట పడింది. ఆయన పేరు రంగడని తరువాత తెల్సింది. ఏం చేస్తున్నాడంటే ...

బేరరు ఓ విస్కీ సీసా తెచ్చి టేబుల్ మీద పెట్టగానే దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. ఆ సీసా కింద కొట్టాడు చేత్తో. ఆ తరువాత పైన కొట్టాడు. ముక్కు దగ్గర పెట్టుకున్నాడు మూత తిప్పాడు.



బొంబాయి మఫత్‌లాల్ సభా గృహంలో ఇటీవల జరిగిన తెలుగు అధ్యాపకుల సమావేశ సందర్భంగా భరతనాట్యం ప్రదర్శించిన కుమారి శ్రీలత కొండూరి

"ఉ హూ!" అంటూ ఆ సీసాను పక్కన పెట్టాడు.

బేరర్ మరో సీసా తెచ్చాడు. దాన్ని ఆ విధంగానే పరామర్శించి పక్కన పెట్టాడు రంగడు.

ఆ టేబుల్ దగ్గర కూర్చున్న మిగతా ముగ్గురు రంగడి ముఖంలోకి చూశారు.

"అసలు సరుకు కాదు" అన్నాడు రంగడు.

వాళ్ళలో పులిలా వున్న ఆయన మేనేజర్ని కేకేశాడు. అతను వచ్చాక "మేము రియల్ స్కాచ్ ఇమ్మంటే దేశవాళి ఇస్తారా?" అని కేకలు వేశాడు.

మేనేజర్ "ఇది నాటు కాదండి" అంటూ లేబుల్ చూపించాడు.

"ఆర్.ఎస్.ఎస్. అంటే ఏమిటో తెల్సా! రంగడు స్టాండర్డ్ స్పెసిఫికేషన్స్ అసలు సిసలైన సరుకు వాటికి కన్‌ఫామ్ అవుద్ది. వైన్ టేస్టర్స్, టీ టేస్టర్స్ టేస్ట్ చేసి గాని మంచో చెడో చెప్పరు. దానికే పెద్ద జీతాలు పుచ్చుకుంటారు. నేను టేస్ట్ చెయ్యకుండా చెప్పగలను" అన్నాడు రంగడు.

"ఏటండి ఆ ఆరెస్పెస్‌లు" అన్నాడు పులి పక్కన కూర్చున నక్కలాటి అతను.

"అసలు స్కాచ్ సీసాకి మూడు చోట్ల కావెస్ వుంటాయి. అవి వయస్సులో పిటపిట లాడుతున్న ఆడపిల్ల జాకెట్ హుక్కుల్లాంటివి. అవి రసికుడి చెయ్యి పడగానే ఫట్ ఫట్ ఫట్ అని తెగిపోతాయి. దొంగ సీళ్ళు వున్న విస్కీ సీసాలు, సరుకు లేని జాకెట్లు ఆ చప్పుళ్ళు చెయ్యవు" అని వివరించాడు రంగడు.

"మీరెల్లాగైనా ఏకాండం ముక్కలు - అదే అఖండులు సార్!" అన్నాడు నక్క.

మేనేజర్ తానే స్వయంగా వెళ్ళి మరో సీసా తీసుకువచ్చాడు. అది రంగడి టెస్టు పాస్ అయింది. అప్పుడు మేనేజర్ పాసవని రెండు సీసాలు తీసుకు వెళ్ళబోయాడు.

"ఉంచేయ్! మూత తిప్పేశాను. వర్జినిటీ పోయింది. నాటువే అయినా అవి నావే! ఈ రోజలాటి సెలెబ్రేషన్స్‌కు అవి పనికిరావుగాని, మామూలు రోజులలో అయితే వీటితో నేను సర్దుకొంటాను" అని వాటిని రంగడు మేనేజరు చేతుల్లోంచి లాక్కున్నాడు.

టెస్ట్ పాసైన సీసా నాలుగు గ్లాసుల్లోకి కొద్ది కొద్దిగా వంచి సోడా సీసాలు తెరిచాడు బేరర్.

"మనది నీట్ సోడా మేరకు విస్కీలో విస్కీయే

## బి.ఎన్. భాషితాలు

వాస్తుశిల్పి బి.ఎన్. రెడ్డి




విద్యాలయాల్లో బుద్ధి నేర్చుకోడం లేదు
కార్యాలయాల్లో పని నేర్చుకోడం లేదు
సంసార జీవితంలో సఖ్యత నేర్చుకోడం లేదు
అన్నీ తెలుసుననే అహంభావం ఎక్కువై అవస్థలు
పడుతున్నాం —



పిన్న వయస్సులో చినిగిపోయిన బట్టలు వేసుకొని
కొత్త పుస్తకాలు పట్టుకొని స్కూల్ కెళ్ళేవాళ్ళం
సింపుల్ గా
వయస్సు వచ్చిన తరువాత కొత్తబట్టలేసుకొని
చినిగిన పుస్తకాలతో కాలేజీకెళ్తున్నాం
స్టైయిల్ గా—



చిన్న పిల్లాడిని వూరికే కొట్టొద్దురా అన్నాడట తండ్రి
తన కొడుకుతో
నా బిడ్డను హద్దులో పెట్టుకునే హక్కు నాకు లేదా
అన్నాడట కొడుకు
నా కొడుకును హద్దులో పెట్టే హక్కు నాకు లేకుండా
పోయింది,
నిన్ను అని ఏం లాభం నాయనా, అన్నాడట ఆ
పెద్దమనిషి ఆవేదనతో —

కలుపుకుంటాను'' అన్నాడు రంగడు.

దిబ్బ భాగోతం కడగంట చూడదల్చుకొని నెమ్మదిగా బీరు సిప్ చేస్తూ అక్కడ జరుగుతున్నది కొసకంట గమనిస్తూ తాగుతున్న సీసా పూర్తవగానే

''మరోటి తెప్పిద్దారేటి?'' అని అడిగాడు పులి లాంటాయన.

''ఒ.కె.'' అన్నాడు రంగడు.

మళ్లీ మొదటి రెండు సీసాలు టెస్ట్ పాస్ అవలేదు. మూడోది అయింది. దాన్ని కూడా హెచ్చు భాగం రంగడే పూర్తి చేశాడు. రంగడు మొహం మీద చిరునవ్వు వచ్చింది.

''మీకు నవ్వొచ్చినట్టు లేదు'' అన్నాడు నక్క లాంటాయన.

''అడ్డుపడింది బయటికి రావడం లేదు, ఆ మరో సీసా తెప్పించండి వస్తుద్దేమో చూద్దాం'' అన్నాడు రంగడు.

ఈసారి తను బాటిల్స్ ఇంటికి తీసుకుపోవడానికి గాను మొదటి రెండు బాటిల్స్‌ని పాస్ చెయ్యడం లేదన్న అపోహ తీసెయ్యడానికి కాబోలు మొదట బాటిల్‌నే పాస్ చేశాడు. ఎక్స్‌పరిమెంటల్ పాయింట్లు మరీ కర్వ్ మీద పడితే బావుండదని నేను లాబ్‌లో ఒకటి రెండింటిని కర్వ్ పక్కన పడేసి కొంత ఎర్రర్ చూపించేవాడిని చదువుకొంటున్న రోజుల్లో. ఆ నైజం ఎక్కడికి పోతుంది మనుష్యుల్లో!

మూడో సీసా పూర్తయ్యేసరికి నెమ్మదిగా స్వప్న రాగలీన నవ్వులా మొదలయ్యి ఘటోత్కచుడి నవ్వులా తేలి రంగడి నవ్వు బారంతా నిండిపోయింది.

''అమ్మయ్య మీకు నవ్వొచ్చింది. ధన్యులం!'' అన్నాడు నక్క.

పులి బిల్లు పే చేశాడు. చెరో చేత్తో చెరో రెండు బాటిల్స్ తీసుకుని తడబడే అడుగుల్తో రంగడు బయటికి నడిచాడు. నేనూ బయటికి నడిచాను.

''ఏ ఇంట్లో దింపమన్నారు?'' అని అడిగాడు నక్క.

''మాకు నవ్వొచ్చిన పూట చిన్నింటికే వెళ్తాం. అదే మన గమ్యం'' అన్నాడు.

రంగడిని ఎక్కించుకొని ఒక కారు బయల్దేరింది. అందులో నక్క వున్నాడు.

పులి మరో కారులో ఎక్కగానే అది స్టార్ట్ అయింది. మూడో ఆయన, ''మరి నా మాటో?'' అన్నాడు.

''నడిచి రా!'' అన్నాడు పులి.

కారు వెళ్ళిపోయింది. ఏదో నూర్తున్న శబ్దం. అది మిగిలిపోయిన ఆయనదగ్గర నుంచి వస్తోంది. ఆయనదగ్గరకు వెళ్లి ''ఎవరీ రంగడు? ఆయనకి నవ్వు రావటానికి మీరు ధన్యులవటానికి ఏమిటి సంబంధం? ఆయనకి నవ్వు రాకపోతే మునిగే మీ కొంపలేవి?'' అని అడిగాను.

జవాబుగా మరింత నూరుడు శబ్దం వినిపించింది. నూరుడెక్కువై నాలుగో ఆయన ముఖంలో ముసలితనం వస్తోంది. అప్పుడు ఆయన నూర్తున్నవి పళ్లని, అవి అరిగిపోతున్నాయని గ్రహించాను.

''నేనడిగిన ప్రశ్నలకి జవాబు చెప్తే నేను మిమ్మల్ని ఆటోలో మీ ఇంటి దగ్గర దింపుతాను'' అని ప్రలోభ పెట్టాను.

ఆయన కళ్లు మెరిసాయి. కాని మళ్లీ ఇంతట్లో బెదురు చూపులు చూశాడు.

''భయం లేదు!'' అన్నాను.

''నా పేరు బయటకు రాకూడదు'' అన్నాడు.

''నాకింత వరకు మీ పేరే తెలియదు! అదెల్లా బయటికి వస్తుంది!'' అని భరోసా ఇచ్చాను.

''నేనో ప్రైవేటు కళాశాల తలకాయని. విద్యార్థులు చెప్పినదానికి, మేనేజ్‌మెంట్ చెప్పినదానికి తలూపడానికి గాను తలకాయ వున్నవాడెవడైనా సరే నేను చేస్తున్న ఉద్యోగానికి కనీసార్హతలు గలవాడి కిందే లెక్క. ఏదైనా తప్పు బహిరంగమైతే దానికి తలవాచేలా తిట్లు తినడానికి కూడా ఈ తలకాయ ఉపయోగపడుతుంది.''

''సెల్ఫు పిటీ వద్దు. అసలు కథ చెప్పండి'' అన్నాను.

అదో పెద్ద విషాద గాథ''

''చెప్పండి. ప్రతి డర్టీ డిటెయిల్, ప్రతి స్పైసీ డిటెయిల్ చెప్పండి. నేను జర్నలిస్టుని. మీరు కథ చెప్పడానికి టైము పడ్తుంది. కనుక ఫోంచేస్తూ చెప్పుకొందాం. బిల్లు నేనిస్తాను'' అంటూ మళ్లీ అదే బార్ అండ్ రెస్టారెంట్ లోకి దారి తీసాను.

''మీరు జర్నలిస్టు కనుక ఈ కథ మీకు తప్పకుండా చెప్తాను. న్యూస్ పేపర్లో బాగా ఏకేయండి. కాని నా పేరు బయటికి మాత్రం రానీయకండి'' అన్నాడు నాన్, మసాలా కూరతో తింటూ.

రాదని వాగ్దానం చేశాను. ఆయన చెప్పసాగాడు.

దిబ్బ రాష్ట్రంలో నాలుగు యూనివర్సిటీలకి నాలుగు కులాల పెద్దలు కులపతులుగా వున్నారన్న విషయం మీకు తెలిసే వుంటుంది. వాటిని జాతీయాభిమానం వల్ల ఎ,బి,సి,డి అని కాక క,కా,కి,కీ లుగా రిఫర్ చేస్తారు. మా కళాశాల కా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా వుంది. మా కులపతిని కా కులపతి అని పిలుద్దాం. మా యూనివర్సిటీ ఎకడమిక్ బాడీస్‌లో అంతా కాకిగోలగ వుంటుంది. దాని అధ్యక్షుడు కనక ఆయన్ని కాకుల పతి అంటారన్న జోక్ వుందనుకోండి. మీరు రాయటానికి బావుంటుందని ఈ జోక్ చెప్పాను. కాకులపతిగారు నాన్నగారికి 'కా' వలసిన వారు. కొడుకులాంటి వారో, కొడుకో కూడావని! నాన్నగారికి దిబ్బ రాష్ట్రం డబ్బు చదువు'కొనే'వారి వల్ల పై రాష్ట్రాలకి పోవటం నచ్చలేదు. అందుకని ఆయన ఉపనయనం అంటే శాసనం చేశారు. దాని ప్రకారం, కొత్త కళాశాల తెరిచేవారికి తెర (వెనుక) తెరిచే విధానం తెలియచెప్తూ బ్రహ్మోపదేశం జరిగేది. కొత్తకాలేజీలు తెరిచేవారు నాన్నగారికి, ఆయన కుటుంబానికి అంటే ఆయన పార్టీకి గురుదక్షిణ అంటే పెద్ద దక్షిణ చెల్లించాలి. అది అవసరం. కాని సరిపోదు. ఈ తెరిచిన కళాశాల ఏదో ఒక యూనివర్సిటీ అడాలో వుండాలి కదా! మాది కా యూనివర్సిటీకి చెందింది. కాకులపతి ఈ కొత్త కాలేజీలకి అన్ని సదుపాయాలు వున్నాయో లేవో పరిశీలించి, వున్నాయని సర్టిఫై చెయ్యటానికి రంగారావు, గోపాలకృష్ణ అనే ఇద్దరు ప్రొఫెసర్లతో కమిటీ వేసాడు. ఈ ఇద్దర్నీ నిజానికి కపి ఆ కమిటీలో వేయించాడు.

''కోతికి మీ యూనివర్శిటీలో ఇంత ఇన్‌ఫ్లుయెన్సుందా?'' అని ఆశ్చర్యంగా అడిగాను.

''రాముల వారి దగ్గర హనుమంతుడికి లేదూ! అల్లాగే కపికి కాకులపతి దగ్గర వుంది. కపి అంటే కంట్రోలర్ ఆఫ్ ప్రైవేట్ కాలేజెస్. కపి చాలా ఘటికుడు. అతను కాకులపతితో 'మీరు చాలా గొప్పవారు, మీరు విలాసంగా అన్నీ గమనిస్తూ అసింటా కూర్చోండి. నేను అన్ని తలకాయ నొప్పులు పడ్తాను' అని చెప్పి పాట, పానం, పడతి మొదలైన విలాసాలన్నీ కాకులపతికి మప్పేడు. యూనివర్సిటీలో గుమాస్తా ఉద్యోగాలకి అప్లై చేసిన అమ్మాయిల్లో ఆ ఉద్యోగం చాలా అవసరం వున్నవారు కొందరున్నారు. అందులో బాగా వున్నవారు కొద్దిమందున్నారు. వాళ్లకి పెద్దల అవసరాలు తీర్చాలనే నిబంధన పెట్టి ఉద్యోగాలిచ్చాడు. అందులో అతి బాగా వున్న అమ్మాయిని కులపతికి కానుకగా ఇచ్చి, సెకండ్ బెస్ట్ తను తీసుకున్నాడు. దాంతో ఒక లేడీ టైపిస్టును దగ్గరగా వుంచుకోటం స్టేటస్ సింబల్ అయింది. అల్లా అవగానే రంగారావు

## రహస్యాలు చెప్పే రాత్రి

భూకంపాలకు ఆహారం అవ్వాలి
కొత్తదారుల్లో పడవాలంటే
జీవితం ఎండల్లో గడవాలి
వర్షం అనే విందుభోజనం రుచి
తెలియాలంటే
రైళ్ళన్నీ ఆగిపోవాలి
నిజమైన ప్రయాణం చెయ్యాలంటే
సముద్రాన్ని తాగగలగాలి
జీవితం అంత దాహం తీర్చుకోవాలంటే
జీవితకాలమంతా గాయాలకు ఆహారంగా
అవ్వాలి
కాలం ఏ వైద్యుడూ మాన్పలేని గాయం అని
తెలియాలంటే
జీవితంలో రక్తపాతం జరగాలి
పేజీలమీద కవితా జలపాతం దూకాలంటే
నేను నలిపి పారేసిన కాగితపు ఉండ
లాంటి చంద్రుడు
రాత్రి దేహంలో నిద్రమాత్రలా కరిగిపోవాలి
నిశ్శబ్దం పాలించే ఈ అంధకారంమీద
నా కవితలు వాలాలంటే—


— సాత్యకి

గోపాలకృష్ణ "మరి మాకో?" అన్నారు. గ్రామ దేవతల్ని గ్రామాల మీద పడి బతకమన్నట్టు, 'మీరు ప్రైవేటు కాలేజీలమీద పడి బతకండి" అన్నాడు కపి. ఆ విధంగా మేము పూలరంగడి, పాల కృష్ణుడి పాలబడ్డాం."

"ఈ పూలరంగడు, పాలకృష్ణుడు భాగోతం ఏమిటి?" అని అడిగాను కుతూహలంగా.

'చెప్తాను" అంటూ తలకాయ చెప్పసాగాడు.

"గోపాల కృష్ణుడికి పాలంటే ఇష్టం. అందుకని పాలకృష్ణుడు అన్న పేరు తెచ్చుకున్నాడు. అతడికి వృత్తిరీత్యా, ప్రవృత్తి రీత్యా కాలుష్యం అంటే పడదు. అందుకని ఆ తాగే కాపిని డైరెక్టుగానే తాగుతాను అనేవాడు. అతనికి క్షేత్రయ్య పదాలు కంఠతా వచ్చు. అందులోని కృష్ణుడు బాలింతల పాలిండ్లతో ఏమేమి చేసేవాడో అవే తనూ చేస్తాననేవాడు. అటువంటి వెలయాళ్ళ కోసం వెతకటంతో ప్రైవేటు కళాశాల




తలకాయల తలకాయలు నోళ్ళల్లోకి వచ్చేవి.

రంగారావుకి ఫుల్ బాటిల్ రమ్ము తాగే శక్తి వుండడం వల్ల ఫుల్ బాటిల్ రంగడు అన్న పేరు వచ్చింది. అది అందరి నోళ్లలో పడి బాటిల్ ఖర్చయి ఫూల్ రంగడయి ఊర్కొంది.

అయితే వీళ్ళ దాహాలు క్షీర, మద్యాలకి పరిమితం కాలేదు. ధన దాహం కూడా వీళ్లకి తగినంతగా వుంది. తమకి వేలివ్వనిదే కాలేజీ వేళ్లానదు అని బాహాటంగానే చెప్పారు. వీళ్ల అల్లరి ఇంతా అంతా కాదు.

ఒక ఎయిర్‌పోర్ట్ కాంటీన్‌లో "నీరు కావాలా?" అని అడిగిన అమ్మాయితో "కామ్మా! రమ్మా! నీ రొమ్ము నీ(య)రమ్మా!" అని తన్నులు తినబోయారు. వీళ్లని రమ్మాయన రొమ్మాయన అని కూడా అంటారు.

ఆ మధ్య మరి కొంతమంది టైపిస్టు అమ్మాయిలు కొత్తగా యూనివర్సిటీలో చేరారు. అప్పుడు కాకులపతి కపులు కొత్తవాళ్లలో బెస్టు వాళ్లని తమ పనిలో పెట్టుకొని పాతవాళ్లని, కొత్తవాళ్లలో మిగిలిన వాళ్ళని కి ద వాళ్లకి రిలీజ్ చేశారు. అప్పటి నుంచి హెడ్ షిప్‌లతో పాటు టైపిస్టులకి కూడా రొటేషన్ సిస్టమ్ మొదలైంది. అయితే వీళ్లందరు పేరుకి 'కుమారి'లు అవటం చేత, వాళ్ల సంతానవతులు అవటానికి వీల్లేకపోయింది. అటువంటి వారి పట్ల పాలకృష్ణుడికి ఇంటరెస్టు లేక ఎవర్నీ కోరలేదు తన వాటాకి. పూల రంగడు అడుగగా అతని వాటాకి 'హాసం' అన్న అమ్మాయినిచ్చారు. అప్పటి నుంచి పూలరంగడు సంతోషంతో,

"నాకు హాసం వచ్చింది" అంటూ వచ్చాడు. ఆపైన "నాకు నవ్వొచ్చింది" అనసాగాడు సంతోషం కలిగినప్పుడల్లా. కాని త్వరలోనే తన వెంట త్వరగా నవ్వొస్తే ప్రై.క.లు పెట్టుకొన్నవారు అంత త్వరగా ధన్యులవుతున్నారని గ్రహించి, నవ్వును త్వరగా బయటకి రానీకుండా పళ్ల బిగువున నొక్కి పెట్టడం నేర్చుకున్నాడు.

రంగడి సహవాసంలో హాసం పెగ్గుల మీద పెగ్గులు బిగించటం, పెగ్గుల మీద పెగ్గులు సడలించడం నేర్చుకుంది. ఆ విధంగా రంగడికి సీసాలు కొనాల్సిన అవసరం ఏర్పడసాగింది. శతకోటి అవసరాలకి అనంత కోటి ఉపాయాలు. అవసరం ఏర్పడగానే అతను ఆర్.ఎస్. ఎస్.ని సృష్టించి ప్రై.క.ల ఖర్చులో బాటిల్స్ చిన్నింటికి చేరవెయ్యటం మొదలుపెట్టాడు. మొదట్లో రంగడు మొహమాట పడ్తుంటే ఆతిధ్యం ఇచ్చినవారు,

"మీ సంతోషమే మా సంతోషం" అన్నారొకసారి. దానికతడు "నా సంతోషం నాదే. మీది కాదు, గుర్తుంచుకోండి. నా సంతోషం మీ బాధ్యత" అన్నాడు నిర్మొహమాటంగా. అప్పటి నుంచి అంతా నిర్మొహమాటమే. తనతోపాటు ఇన్‌స్పెక్షన్‌కి హాసాన్ని తీసుకువెళ్లి గెస్టు హౌస్‌లో దించేవాడు.

"కొద్ది నెలల క్రితం మా కళాశాలకి వచ్చారు రంగడు, అతని నవ్వును. ఆమె తనకి పంపే భోజనంతో పాటు నిమ్మకాయ బద్దలు పంపమని చెప్పమని రంగడితో చెప్పిందని మాతో చెప్పాడు. కాని మేము మర్చిపోయి పంపలేదు. అప్పుడు చూడాలి అతను వేసిన గంతులు. కాని అసలు గంతులు హాసానికి నిమ్మకాయ బద్దలు ఎందుకు కావలసి వచ్చాయో తెలిసిన పూట వేసాడుట. వాటితో పోలిస్తే మా దగ్గర వేసినవి కుప్పిగంతులట. హాసానికి నిమ్మకాయ బద్దలు కోర్కె కలగకుండా ఒప్పించటానికి ఆమెకి ముట్టచెప్పింది, కలిగిన కోర్కె తొలగించటానికి డాక్టర్‌కి ముట్టచెప్పింది, తడసి మోపెడయిందిట. అప్పటి నుంచి సేఫ్ పిరియడ్‌లో మాత్రమే చిన్నింటికి వెళ్తున్నాడంటారు" అని కథ ముగించాడు తలకాయ.

ప్రై.క. తలకాయని ఇంటి దగ్గర దింపి వెళ్లిపోయాను.

ఒక నెల తరువాత ఇదంతా ఒక వ్యాసంగా వ్రాసి సంపాదకుడికిచ్చి అది ఆయన చదువుతూ వుంటే ఆయన మొహంలోకి చూస్తూ నిలబడ్డాను. అది చదివాక ఆయన, ఒక విలేకరి పంపిన న్యూస్ అయిటమ్స్ ఫైల్లో నుంచి తీసి నాకు చదవమని ఇచ్చాడు. అందులో ఇల్లా వుంది:

రంగడికి పిచ్చెక్కింది.

దిబ్బ రాష్ట్రం: ప్రొఫెసర్ రంగారావుకి, పూర్వం ఆయన దగ్గర పనిచేసి వుండిన ఒకామెకు దగ్గర సంబంధం వుండేదని, ఆయన తనకి సంతోషం కలిగినప్పుడల్లా "నాకు నవ్వొచ్చింది" అనే వాడని విశ్వసనీయ వర్గం ద్వారా తెలుస్తోంది. అయితే ఆమెకీ మధ్య నాన్నగారి ఆఫీసులో పెద్ద ఉద్యోగం వచ్చి వెళ్లిపోయిందిట. రంగారావు ఈ మధ్య ఆ ఊరు వెళ్ళినప్పుడు ఆమెను కలుసుకోవాలని ప్రయత్నించాడని, అప్పుడామె "నేను నీ కమ్మని" అందని, నాన్నగారికి రంగారావు ప్రయత్నం గురించి తెలిసి కోపించారని దీనంతటికి సూత్రధారుడైన కపి గారి తోక కాకులపతి గారితో చెప్పి కత్తిరింపించారని అనుకొంటున్నారు. అక్కడితో ఆగకుండా ఉపనయనం శాసనాన్ని గవర్నర్ ఆర్డినెన్సు ద్వారా రద్దు పరిచారు. ఈ వార్త రేడియోలో వినగానే ప్రొఫెసర్ రంగారావుకి పిచ్చెక్కిన వైనం ఆయన భార్య ద్వారా ఈ విలేకరికి తెలిసింది.

ఒ.వి.

"నీ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయింది. ఇది కరెంట్ టాపిక్ కాదు" అన్నాడు సంపాదకుడు, సానుభూతి చూపిస్తూ.

"పోనీ చరిత్ర విభాగంలో వేసుకోండి" అన్నాను మొండిగా.

"అవును, ఇది వింటేజ్ వైన్" అన్నాడాయన నవ్వుతూ ●